క్లుప్తంగా

బల్దియా ఏసీపీ-2గా శ్రీధర్‌రెడ్డి



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఏసీపీ–2గా శ్రీధర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను కలిసి చార్జి తీసుకున్నారు. శ్రీధర్‌రెడ్డి ఇదివరకు గజ్వేల్‌లో టీపీవోగా విధులు నిర్వహించి పదోన్నతిపై నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు వచ్చారు.

ఎమ్మెల్సీల విజయం కార్యకర్తల కృషి ఫలితమే



సుభాష్‌నగర్: ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేసిన టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా ఎమ్మెల్యేలు, అధ్యక్షుడు, నాయకులు సోమవారం సన్మానించారు. నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి ఎమ్మెల్సీలను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీల విజయం బీజేపీ కార్యకర్తల కృషి ఫలితమేనన్నారు. ఎమ్మెల్సీలు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యతను గుర్తుంచుకుని, పార్టీ సిద్ధాంతాలకు నిబద్ధతతో సేవ చేయాలని పేర్కొన్నారు.

రూరల్ ఫాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న క్రైస్తవులు

డిచ్‌పల్లి: పాస్టర్ ప్రవీణ్ పగడాల అకాల మరణం పట్ల సందేహాలున్నాయని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రులు ఈ విషయమై ఉన్నత స్థాయిలో విచారణ జరిపించి న్యాయం చేయాలని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి డిచ్‌పల్లి మండల కేంద్రంలోని విక్టోరియా సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో ప్రవీణ్ పగడాల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ క్రైస్తవులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఆయన మృతిపట్ల ఉన్న మిస్టరీ తొలగాలని క్రీస్తును ప్రార్థించారు.


మూడు నెలలుగా అందని జీతాలు

ఇందల్వాయి: స్థానిక తహసీల్ కార్యాలయంలో 61 ఎబౌవ్ కేటగిరీ కింద పని చేస్తున్న 9 మంది వీఆర్ఏలకు మూడు నెలలుగా జీతాలు అందడం లేదు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల జీతం పెండింగ్‌లో ఉందని, నెలవారి ఖర్చులకు ఇబ్బందిగా ఉంటుందని వారు సాక్షి ముందు వాపోయారు. క్రమం తప్పకుండా విధులు నిర్వహిస్తున్నా జీతాలు సక్రమంగా రావడం లేదని, కుటుంబ పోషణ భారంగా మారుతుందని, అధికారులు స్పందించి తమ జీతాలు సకాలంలో అందేలా చూడాలని వారు కోరారు.

ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

మోపాల్: దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్, బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకులు సాయన్న పేర్కొన్నారు. ఈమేరకు మోపాల్, సిర్‌పూర్ గ్రామాల్లో నిరసనకు సంబంధించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సాయన్న మాట్లాడుతూ.. రైతుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోగా, ఆందోళన చేస్తున్న రైతులు, రైతు నాయకులపై తీవ్ర నిర్బంధం ప్రయోగించారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సాయాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి



మోర్తాడ్: వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని భీమ్‌గల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగుల సంతోష్ కుమార్ అన్నారు. సోమవారం తమ కార్యాలయంలో కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. తాగునీటి ఎద్దడి లేకుండా చూడటం, ఉపాధి పనులకు కూలీలను అధిక సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్, ఇందిరమ్మ ఇండ్ల జాబితాల పరిశీలన, నర్సరీల నిర్వహణపై శ్రద్ధ చూపాలని సూచించారు. ఎంపీవో జావిద్ పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్ షురూ..!

- నగరంలో క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన
- ఏఈలకు బాధ్యతలు
- నేటి నుంచి రీసర్వే ప్రారంభం



బల్దియా కార్యాలయం



ఇందిరమ్మ ఇండ్ల యాప్

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలువురు పేదలు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇదివరకే దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు 50 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వీటిని డిసెంబర్‌లో బల్దియా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తుదారుల వివరాల అధికారులు 'ఇందిరమ్మ ఇండ్లు' యాప్‌లో నమోదు చేశారు. వారి ఫొటోతో పాటు ఇచ్చిన వివరాలు యాప్‌లో నమోదు చేశారు. అయితే ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలను రీసర్వే చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇతర మున్సిపాలిటీల్లో ఈ రీసర్వే ఇది వరకే ప్రారంభమైంది. నిజామాబాద్ బల్దియాలో మాత్రం నేటి నుంచి క్షేత్రస్థాయిలో రీసర్వే నిర్వహిస్తున్నారు. రీసర్వేను మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ స్వయంగా పర్యవేక్షిస్తారు. ఆయన ఒక్కడికే లాగిన్ ఉంటుంది. అయితే జోన్‌కు ఒకరు చొప్పున ఐదుగురు అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించారు. వారిలో ఐదుగురు ఏఈలున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన..

ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వద్దకు ఈ అధికారులు స్వయంగా వెళ్తారు. వారి ఫొటోతోపాటు ఆధార్‌ను సరిచూసుకుంటారు. దరఖాస్తులో ఉన్నవిధంగా ఆధార్‌లో పేరు ఉందా లేదా అని సరిచూసుకుంటారు. కుటుంబ సభ్యుల వివరాలు, సొంత ప్లాట్ ఉంటే వాటి వివరాలు, సొంత స్థలం లేకుంటే ఆ వివరాలు కూడా నమోదు చేస్తారు. ఈ వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. వీటిని కమిషనర్ దిలీప్ కుమార్ పరిశీలించి ఫైనల్ చేస్తారు.

నేటి నుంచి సర్వే చేస్తాం



ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను 'ఇందిరమ్మ ఇండ్లు' యాప్‌లో నమోదు చేశాం. ప్రభుత్వం మళ్లీ సర్వే చేయాలని ఆదేశించింది. నగరంలో రీసర్వే మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఐదుగురు ఏఈలను ప్రత్యేకంగా నియమించాం. ఈ బృందం క్షేత్రస్థాయిలో రీసర్వే చేయనుంది.

– దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

మనమే రామభక్తులం.. వాళ్లు మోదీ భక్తులు



మోపాల్‌లో ఎమ్మార్సీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- మోపాల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మోపాల్(నిజామాబాద్‌రూరల్): దేశంలోని ప్రతి హిందూ రామభక్తుడేనని, మనమంతా రామభక్తులమని వాళ్లు మోదీ భక్తులని బీజేపీ నాయకులనుద్దేశించి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి విమర్శించారు. రెండు రోజుల క్రితమే శ్రీరామనవమి సందర్భంగా అందరూ ఆలయాలకు వెళ్లి సీతారాములను దర్శించుకుని పూజలు చేశామని గుర్తుచేశారు. సోమవారం మండలంలోని మోపాల్, నర్సింగ్‌పల్లి, ముదక్‌పల్లి, మంచిప్ప, సిర్‌పూర్, న్యాల్‌కల్ గ్రామాల్లో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, మహిళా సమాఖ్య భవనాలు, సొసైటీ కమ్యూనిటీహాల్, మోపాల్‌లో రూ.40లక్షలతో నిర్మించనున్న ఎమ్మార్సీ భవనానికి శంకుస్థాపన చేశారు. మంచిప్పలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. న్యాల్‌కల్‌లో సుమారు రూ.2 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు ఎస్ఈ రాపెల్లి రవీందర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని, ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కలిసే పని చేశారని గుర్తు చేశారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని, వారికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు..

రాబోయే మూడున్నరేళ్లలో నియోజకవర్గంలో ఇండ్లు లేని వారు ఉండొద్దని, నెల రోజుల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులు, రేషన్‌కార్డు ఇస్తామని, సన్నబియ్యంతోపాటు 9 రకాల సరుకులు రేషన్ దుకాణాల్లో ఇస్తామని తెలిపారు. నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, ఆదివాసీ, గిరిజన చైర్మన్ కెతావత్ యాదగిరి, జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ బోర్గాం శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ లింగన్న, సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు గంగాప్రసాద్, కిరణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం





సుద్దపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్ ప్రభాకర్.. పాల్దాలో.. చైర్మన్ శ్రీనివాస్

డిచ్‌పల్లి: మండల మహిళా సమాఖ్య(ఐకేపీ) ఆధ్వర్యంలో సోమవారం సుద్దపల్లి, నడిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ప్రభాకర్ ప్రారంభించారు. ఆర్ఐ సంతోష్, ఏపీఎం రజిత, ఏఈవో నృపేష్‌కుమార్, మాజీ సర్పంచ్ సతీష్ కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, వీవో అధ్యక్షురాలు రజిత, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించవద్దు

నిజామాబాద్ రూరల్: పాల్దాలో కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ కొలాస్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైతులు శుభ్రం చేసిన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

సిరికొండ: పాకాల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన యువకులు రమేష్, గంగాధర్‌లు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో డైరెక్టర్, సొసైటీ సీఈవో అవకతవకలకు పాల్పడుతున్నారని వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఆరోగ్యకర ప్రారంభమే రేపటి భవిష్యత్తుకు పునాది



మాట్లాడుతున్న జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు

నిజామాబాద్‌నాగారం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక కోటగల్లీలోని ఆర్య సమాజ్ పాఠశాలలో ఆరోగ్య అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సుకు జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ.. ఆరోగ్యకర ప్రారంభమే రేపటి భవిష్యత్తుకు పునాదని, విద్యార్థులు విద్యార్థి దశ నుంచే మంచి ఆరోగ్య అలవాట్లు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం, పోషకాహారం తీసుకోవడం తదితర అంశాలను ప్రతిరోజూ ఆచరించడంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత, రాజేశ్వర్, విమలేశ్వరి, ఆశా కార్యకర్త రజిత, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే ఇక జైలుకే



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ట్రాఫిక్ సీఐ ప్రసాద్

ఖలీల్‌వాడి: మైనర్లకు వాహనాలిస్తే యాజమానులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సోమవారం హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మైనర్లతోపాటు వారి కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ.. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ డ్రైవ్‌లో ఐదుగురు మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుపడగా వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి, ఐదుగురు వాహన యజమానులకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. ట్రాఫిక్ సీఐ ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం



సీతారాముల ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, తదితరులు



సిరికొండ: యజ్ఞం చేస్తున్న భక్తులు

డిచ్‌పల్లి: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోనే చారిత్రక ప్రసిద్ధి చెందిన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో సోమవారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ పట్టాభిషేక వేడుకల్లో పాల్గొని స్వామి వారిని సేవించుకున్నారు. పట్టాభిషేకం అనంతరం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. శ్రీరాముని కరుణా కటాక్షాలతో ప్రజలు ఎల్లప్పుడు సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ శాంతయ్య ఆధ్వర్యంలో బాజిరెడ్డి గోవర్ధన్‌ను సన్మానించారు. ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాంబరి మోహన్, నాయకులు దాసరి లక్ష్మీనర్సయ్య, శక్కరికొండ కృష్ణ, ఒడ్డెం నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

సిరికొండ: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో 62వ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో పురోహితులు నాగరాజుశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సైబర్ నేరాలపై అవగాహన

నిజామాబాద్ రూరల్: ఆకుల కొండూరులో గ్రామస్తులకు సైబర్ నేరాలపై సోమవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన నిర్వహించారు. ఫోన్లలో వచ్చే వన్ టైం పాస్‌వర్డ్ చెప్పొద్దని, అనవసరమైన బ్యాంక్ లింకులు ఓపెన్ చేయవద్దని సూచించారు. మత్తు పదార్థాలు, బెట్టింగ్ యాప్‌లపై అవగాహన, అప్రమత్తత అవసరమని అన్నారు. ప్రొగ్రాం కో– ఆర్డినేటర్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ అశోక్ కు మార్, వాయుపుత్ర యూత్ సభ్యులు పాల్గొన్నారు

విద్యుత్ ఉద్యోగులకు క్యాన్సర్‌పై..

సుభాష్‌నగర్: నగరంలోని వర్నిరోడ్డులో గల పవర్‌హౌజ్‌లో యశోదా ఆస్పత్రి(సికింద్రాబాద్) ఆధ్వ ర్యంలో విద్యుత్ ఉద్యోగులకు క్యాన్సర్‌పై అవగాహ న సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్ర ముఖ వైద్యులు రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం, రసాయన మందుల వాడకం, తదితర ఆహారపు అలవాట్ల కారణంగా క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. అనంతరం క్యాన్సర్ వ్యాధి లక్షణాల గురించి వివరించారు.

కాంస్య విగ్రహం ఏర్పాటు చేయండి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని పులాంగ్ చౌరస్తాలో అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయా లని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నేతలు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. పులాంగ్ చౌరస్తాను అభివృద్ధి పరిచి పెద్ద కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిసి విన్నవించారు. నేతలు గైని గంగారాం, సక్కి విజయ్, తదితరులున్నారు.

'ఇందిరమ్మ' నిర్మాణాలకు మార్కింగ్

ధర్పలి: సీతాయిపేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మించు కోవడానికి అధికారులు సోమవారం భూమి పూజ చేసి మార్కింగ్ చేశారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని అర్సపల్లి 33/11 కేవీ(డీ–6) సబ్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్–1 ఏడీఈ ఆర్ చంద్రశేఖర్, డీ6 ఏఈ ఎంఏ రవూఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీని 8 ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏకి పెంచుతున్నామని పేర్కొన్నారు. ఆటోనగర్, అర్సపల్లి, టెలిఫోన్ కాలనీ, గౌసియా మజీద్, సీఎం రోడ్, మదీనా ఈద్గా, సతీశ్‌నగర్, డెయిరీ ఫామ్ ఎక్స్‌రోడ్, ఫ్రూట్ మార్కెట్, ఎన్నారై కాలనీ, సనత్‌నగర్, హబీబ్‌నగర్, తీన్ కమాన్, మాలపల్లి, ముజాహిద్‌నగర్ తదితర కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, గణేశ్ గుప్తా.. పక్కన మాజీ మేయర్

నిజామాబాద్‌అర్బన్: వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా సమక్షంలో వారు పార్టీలో చేరగా.. కండువాలు కప్పి పార్టీలోకి వారు ఆహ్వానించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రాజ్యాంగేతర శక్తుల ప్రమేయం పెరిగిందన్నారు. తెలంగాణ ఆత్మ గౌరవాన్ని ఢిల్లీ పెద్దలకు తాకట్టు పెట్టిన రాష్ట్ర కాంగ్రెస్ నేతలు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. మోదీతో రేవంత్ డీల్ చేసుకొని తెలంగాణ యూనివర్సిటీల భూములను సేల్‌కు పెట్టారని ఆరోపించారు. మాజీ మేయర్ దండు నీతూ కిరణ్, మాజీ సుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్య ప్రకాష్, జగత్ రెడ్డి, నవీద్, ఇక్బాల్, మతిన్, ఇమ్రాన్, షెహజాద్ సనావుల్లా తదితరులు పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



సూర్యనగర్‌లో సంచరిస్తున్న కుక్కలు

నిజామాబాద్ నాగారం: నగరంలో కుక్కల బెడద ఎక్కువైంది. ఏ వీధిలో ఏ సందులో చూసినా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కాలనీల్లో ఒంటరిగా వెళ్లాలంటే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని గాయత్రినగర్, సూర్యనగర్, రైతునగర్, ఈస్ట్‌బ్యాంక్ కాలనీ, తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద దారుణంగా తయారైంది.

చిన్నపిల్లలు స్కూలుకు వెళ్లే సమయంలో సైతం తల్లిదండ్రులు లేకుండా బయటకు వెళ్లలేకపోతున్నారు. ఎప్పుడు ఏ సమయంలో కుక్కలు వచ్చి దాడి చేస్తాయోనని భయపడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కుక్కలు వీర విహారం చేస్తూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి.

కుక్కలను నియంత్రించాలి



కుక్కల బెడద దారుణంగా ఉంది. రాత్రి వేళలో బైక్‌ల మీద వెళ్తుంటే వెంట పడుతున్నాయి. గుంపులుగుంపులుగా ఉంటే చిన్నపిల్లలతో వెళ్లాలంటే భయమేస్తోంది. అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలి.

–బి.లింబాద్రి, సూర్యనగర్

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



సీతాయిపేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

ధర్పల్లి: సీతాయిపేట్‌లో సోమవారం ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరం ఏడు రోజులపాటు కొనసాగుతుందని ప్రోగ్రాం ఆఫీసర్ కుమారస్వామి తెలిపారు. 50 మంది వలంటీర్లు పాల్గొని మొదటి రోజు గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి డిగ్రీ కళాశాల నుంచి రాజనీతి శాస్త్ర అధ్యాపకులు రామచందర్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సమాజ సేవలో ముందుండాలని సూచించారు. వివిధ సామాజిక అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	92,000	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	84,915	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	80
బీరకాయ	50	70	దోసకాయ	25	50
దొండకాయ	40	60	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	80	120	గోబిగడ్డ	12	24
కాకరకాయ	50	90	గోబిపువ్వు	40	60
వంకాయ	12	24	బీట్‌రూట్	20	40
పాలకూర	25	50	కరివేపాకు	70	120
మెంతికూర	60	90	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	60	80
పుదీనా	50	80	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఆదిత్య-369-11.00
	మ్యాడ్ స్క్వేర్-1.30, 7.30, 10.30
స్క్రీన్-2	రాబిన్‌హుడ్-1.30,7.30-శారీ-4.30
	ఎల్‌వైఎఫ్-10.30
	ఎల్-2 ఎంపురాన్(తెలుగు)-4.20, 10.30
స్క్రీన్-3	సికందర్(హిందీ)-11.00,1.40, 4.30, 7.30, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సికందర్(హిందీ)-10.40, 4.35 ఎ మైన్‌క్రాఫ్ట్ మూవీ (3డీ ఇంగ్లీష్)-2.15, 8.10, 10.30
స్క్రీన్-2	ఎ మైన్‌క్రాఫ్ట్ మూవీ(3డీ ఇంగ్లీష్)-10.55 రాబిన్‌హుడ్-1.55 మ్యాడ్ స్క్వేర్-4.25, 10.10 సికందర్(హిందీ)-7.10
స్క్రీన్-3	సికందర్(హిందీ)-10.30, 1.30, 4.30, 10.35 ఎల్‌వైఎఫ్-7.30
స్క్రీన్-4	వృషభ-11.00 -శారీ-2.00 28సీ-4.50 -రాబిన్‌హుడ్-7.15 ఆదిత్య369-10.25
లలితామహల్ కోర్ట్, దేవి	రాబిన్‌హుడ్
నటరాజ్	షణ్ముఖ, విజయ్ మ్యాడ్ స్క్వేర్